భక్తిశ్రద్ధలతో అఖండ భజన

• 18 గంటల పాటు సాగిన భజనలు



అఖండ భజన చేస్తున్న అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు, భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో 100వ ఇంటింటా భజన–మన ఇంట్లో భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. బుధవారం తెల్లవారుజామున 3గంటలకు ఓంకారంతో అఖండ భజనను ప్రారంభించగా రాత్రి 9 గంటల వరకు 18 గంటల పాటు కొనసాగింది. ధ్వజారోహణం, గోపూజ, అఖండజ్యోతి, జ్యోతిప్రజ్వలన, ఉదయం 11 గంటలకు పంచామృత అభిషేకం, రాత్రి పుష్పార్చన, పడిపూజ, మహా మంగళహారతి, హరివరాసనం నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. పలువురు ఆలపించిన అయ్యప్ప స్వామి భక్తిగీతాలు అలరించాయి. అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్‌దేశ్‌పాండే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమితి ఆధ్వర్యంలో సేవా పనులతో పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ఆధ్యాత్మికం కొనసాగేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి హరినారాయణ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు సీమ నరేందర్, వనపర్తి జిల్లా అధ్యక్షులు ముత్తు గురుస్వామితో పాటు ఉమ్మడి జిల్లాలోని సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

■ అఖండ భజనలో పార్టీలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



జడ్చర్ల టౌన్: పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డా.కృష్ణ ఆకస్మికంగా తనిఖీచేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఆరోగ్యకేంద్రంలో అందిస్తున్న సేవలు సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డా.మనుప్రియ ఉన్నారు.

సంత్ రవిదాస్‌కు ఘన నివాళి



జడ్చర్ల టౌన్: సంత్ రవిదాస్ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.నర్మద రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవిదాస్ బోధనలను విద్యార్థులకు వివరించారు. ఆయన బోధనలు సమాజానికి మార్గదర్శకం అన్నారు. హిందీ విభాగం అధ్యక్షుడు డా.నర్సింహారావుకళ్యాణి, ఆంగ్లఅధ్యాపకులు సతీష్‌రెడ్డి, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పుష్పలత, అధ్యాపకులు శ్రీనివాసులు, షాహిన్‌సుల్తానా ఉన్నారు.

రాజకీయ విప్లవకారుడు..

మహబూబ్‌నగర్ రూరల్: భారతదేశ చరిత్ర గతిని మార్చిన గొప్ప సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విప్లవకారులలో ఒకరు సంతు రవిదాస్ అని జ్ఞాన నీలిమెరుపు బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ జిల్లా కన్వీనర్ పాతూరు రమేష్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాతపాలమూరు జైభీమ్‌చౌరస్తాలో రవిదాస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, ఎర్ర నరసింహా, కాలె నరేందర్, దినేష్, కృష్ణయ్య, సతీష్, శివన్న పాల్గొన్నారు.

మంత్రి లేక విద్యారంగం నిర్వీర్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా విద్యా శాఖ మంత్రి లేకపోవడంతో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు.

ప్రణాళికతో బోధన జరగాలి

గండేడ్: పాఠశాలల్లో విద్యార్థులకు ప్రణాళికతో బోధన జరగాలని ఏఎంఓ(అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని సల్కర్‌పేటలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలు పరిశీలించారు. వర్క్‌బుక్‌ల వినియోగం వాటిని కరెక్షన్ చేయడం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. వారికి అర్థమయ్యేలా బోధన సాగాలని, అప్పుడే వారు ముందుకు పోవడానికి వీలుంటుందన్నారు. అనంతరం ఐఎఫ్‌పీ టీవీల వినియోగంపై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు లారీ దగ్ధం

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ శివారులో ప్రధాన రహదారిని అనుసరించి కొనసాగుతున్న కోళ్ల దాణ పరిశ్రమ దగ్గర బుధవారం ప్రమాదవశాత్తు ఓ లారీ పాక్షికంగా దగ్ధమైంది. దాణ పరిశ్రమకు మొక్కజొన్న లోడ్‌తో వచ్చిన లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. మంటలు వ్యాప్తి చెందుతున్న సమయంలో చుట్టుపక్కల వారు గమనించి వెంటనే నీళ్లతో మంటలను ఆర్పివేశారు.లారీ క్యాబిన్‌లో క్లీనర్ వంట చేస్తున్న క్రమంలో స్టౌ మంటలు క్యాబిన్‌కు అంటుకున్నట్లు గుర్తించారు.

30కుక్కల తరలింపు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం 30కుక్కలను పట్టుకొని మహబూబ్‌నగర్ ఏబీసీ కేంద్రానికి తరలించారు. మంగళవారం వీధికుక్క చేసిన స్వైరవిహారంలో 6మంది తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన మున్సిపాలిటీ అధికారులు కుక్కలను పట్టేందుకు మహబూబ్‌నగర్ నుంచి నిపుణులను రప్పించారు. వారు తెల్లవారుజామున 5గంటల ఉంచి 23వవార్డుతోపాటు పట్టణంలోని పలుప్రాంతాల్లోనూ మొత్తం 30కుక్కలను పట్టుకుని మహబూబ్‌నగర్ ఏబీసీ కేంద్రానికి తరలించారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం



గండేడ్: మండలంలోని వెన్నచేడ్, జంగంరెడ్డి పల్లి గ్రామాల్లో బుధవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపించారు. గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రతి సంవత్సరం పౌర్ణమికి వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వేలం ద్వారా రూ.1.36లక్షల ఆదాయం

భూత్పూర్: పట్టణంలోని శ్రీమునిరంగ స్వామి బ్రహోత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన వేలం పాటలో రూ.1.36లక్షల ఆదాయం వచ్చింది. సోమవారం నుంచి వారం రోజులపాటు జరిగే మునిరంగస్వామి బ్రహోత్సవాల సందర్భంగా కొబ్బరికాయల వేలం రూ.70వేలు, లడ్డు, పులిహార రూ.34వేలు (కేశవులు), తైబజార్ రూ.32వేలు తిమ్మప్ప వేలం పాటలో దక్కించుకున్నారు.

మునిరంగస్వామి ఉత్సవ కమిటీ ఎన్నిక



సోమవారం నుంచి జరిగే మునిరంగస్వామి ఉత్సవ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా గడ్డం ఎల్లప్ప, ఉపాధ్యక్షులుగా రవికుమార్, నర్సింహా, సెక్రటరీగా మండి అంజి, ట్రెజరర్‌గా జి.యాదయ్య, జాయింట్ సెక్రటరీలుగా వడ్ల బ్రహ్మయ్య, శ్రీశైలం, కల్చరల్ ప్రోగ్రాం నిర్వాహకుడిగా ధనుంజయ్, సభ్యులుగా కృష్ణయ్యగౌడ్, పి.నర్సింహా, సాయికుమార్, మల్లేష్, నర్సింహులు, యాదగిరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ పూర్వకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ



నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు మండలాల వారీగా ప్రారంభం కానున్నాయి. మండల ముఖ్యఅధికారులు ఇప్పటికే ఎన్నికల శిక్షణ పూర్తి చేసుకొని వచ్చారు. ఇతర అధికారులు, ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది పీఓ, ఏపీఓలకు రెండు రోజులు శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టనున్నారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే మండలాలకు ఎన్నికల సామగ్రి సైతం చేరింది. వాటిని వరుస క్రమంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీల వారీగా సిద్ధం ఉంచారు.

రోడ్ల పనులకు భూమి పూజ



చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.1.18 కోట్ల రుపాయల నిధులను మంజూరు చేసింది. బుధవారం మండల కేంద్రంలో కుర్వ శంకరయ్య పొలం నుంచి మద్దూర్ గ్రామ బీటీ రోడ్డు వరకు, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ఎర్రకాల్వ వరకు మట్టి రోడ్డు ఏర్పాటుచేసేందుకు అధికారులు గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన

• విద్యా, వైద్యరంగాలకు పెద్దపీట
• జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



రంగారెడ్డిగూడలో ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యం ప్రజాపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డిగూడలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధిని చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి రూ.93 కోట్లు తెస్తే ఏడాదిలోనే రూ.200 కోట్లకు పైగా నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపీడీఓ మశ్చందర్, మండల వైద్యాధికారి డా.సుశ్మిత, ఏఎన్ఎం లలిత, సుజాత, నాయకులు రాములుగౌడ్, కుమార్‌రెడ్డి, కృష్ణయ్య, మోహన్‌నాయక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి

• మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆపార్టీ మండల ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రమౌళి, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, నాయకులు నారాయణగౌడ్, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, బాలస్వామి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

అడ్డాకుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం పెద్దమునుగల్‌ఛేడ్‌లో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో జరిగిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మహిమూద్, జయన్నగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులున్నారు.

గ్రామాగ్రామాన గులాబీ జెండా ఎగరాలి

దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాగ్రామాన గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేవరకద్రలో మున్సిపల్, మండల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు కరణంరాజు, వెంకటేశ్, బాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, నరేందర్‌రెడ్డి, రాధాకృష్ణ, చల్మారెడ్డి, యుగంధర్‌రెడ్డి, అంజనేయులు, మోహన్‌రెడ్డి, తిరుపతయ్య, గౌస్, శ్రీనివాసులు, హన్మిరెడ్డి తదితరులపాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

• టీఈఈ1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు స్వామి
• ఘనంగా ప్లాటినం జూబ్లీ వేడుకలు



టీఈఈ 1104 యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్(టీఈఈ) 1104 యూనియన్ కార్మికుల పక్షాలన నిరంతరం పోరాటం చేస్తుందని ఆయూనియన్ జిల్లా అధ్యక్షుడు స్వామి అన్నారు. బుధవారం విద్యుత్ భవన్ ముందు ప్లాటినం జూబ్లీ (75 సంవత్సరాలు పూర్తి చేస్తున్న సందర్భంగా) వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ ఏర్పడి 75ఏళ్లు పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పాండునాయక్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని, అందుకే తమ యూనియన్‌కు ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, డివిజన్ కార్యదర్శి పెంటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేఖర్, అదనపు కార్యదర్శి రామరాజు, సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, సర్కిల్ కార్యదర్శి కుమార్, అదనపు కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా సలహాదారులు మురళీ, రవిశంకర్, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



తలంబ్రాలు పోస్తున్న దుష్యంత్‌రెడ్డి దంపతులు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడలో శ్రీలక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, భజనలు, హరినామ సంకీర్తనలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలను, ఒడిబియ్యాన్ని ఆలయ ధర్మకర్త దిలీప్‌రెడ్డి కొడుకు దుష్యంత్‌రెడ్డి మేళతాళాల మధ్య తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, దేవర్‌కద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డితో పాటు గ్రామస్తులు రాములుగౌడ్, శివప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, కుమార్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు నాయకుల ముందస్తు అరెస్ట్

జడ్చర్ల టౌన్: కులగణనలో మున్నూరు కాపుల శాతం తక్కువగా చూయించారని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన మున్నూరుకాపు నాయకులను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో కౌన్సిలర్ బుక్కమహేష్, బీజేపీ నాయకులు సామల నాగరాజు, బుక్కనవీన్, కాంగ్రెస్ నాయకుడు పెద్ది వెంకటేశ్, శశి ఉన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

• ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మూసాపేటలో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. అడ్డాకులలో ఈద్గాకు ప్రహరీ, గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. గుడిబండలో సీసీరోడ్ల నిర్మాణం, కందూర్‌లో హైస్కూల్‌కు ప్రహరీ, మినరల్ వాటర్ ప్లాంట్, సీసీ రోడ్ల నిర్మాణం, పొన్నకల్, రాచాల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూసాపేట మండలంలో కొమిరెడ్డిపల్లి, మూసాపేట, నిజాలాపూర్, అచ్చాయపల్లి, జానంపేట, పోల్కంపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. తమ ప్రభుత్వం విద్యాశాఖకు ఎప్పుడూ లేని విధంగా నిధుల కేటాయింపును పెంచిందని గుర్తుచేశారు. తోట శ్రీహరి, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి ఉన్నారు.

గోదాం ప్రారంభం

మూసాపేట మండలం పోల్కంపల్లిలో నాబార్డు నిధులతో నిర్మించిన 1000మెట్రిక్ టన్నుల గోదాంను డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన నవాబుపేట



తిరుమలనాథస్వామి ఉత్సవాల్లో భక్తులు

నవాబుపేట: గోవింద నామస్మరణతో నవాబుపేట మార్మోగింది. బుధవారం తిరుమలగుట్టలో వెలసిన తిరుమలనాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మరికల్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం..

మండలంలోని మరికల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, చంద్రశేఖర్, అంజయ్య, నిరంజన్, రవి, స్వామి, మల్లేష్, శేఖర్, కేశవులు, రాజు, బద్రి, రమేష్ ఉన్నారు.

పోమాల్‌లో టీబీ వైద్యశిబిరం

నవాబుపేట: మండలంలోని పోమాల్ గ్రామంలో బుధవారం టీబీ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డా.శ్రావణ్ ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. అనుమానితులకు ప్రత్యేక పరీక్షలు చేసి వారికి ముందు జాగ్రత్త చర్యగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శరభలింగం, శ్రీనివాస్, రాఘవేందర్, భవానిసింగ్, భాస్కర్ తదితరులున్నారు.

అన్నిస్థానాల్లో బీజేపీ పోటీ

జడ్చర్ల టౌన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీచేయాలని ఆపార్టీ మండల నాయకులు నిర్ణయించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దయానంద సరస్వతి గొప్ప తత్వవేత్త

స్టేషన్ మహబూబ్‌నగర్: మహర్షి దయానంద సరస్వతి భారతీయ గొప్ప తత్వవేత్త అని రాజస్తాన్‌కు చెందిన ఓంముని వానప్రస్థి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మహర్షి దయానంద సరస్వతి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ దయానంద సరస్వతి అనేక సామాజిక సంస్కరణలకు మద్దతు పలికారని అన్నారు. అగ్నిముని వానప్రస్థి తూము సుభాష్ ఆర్య, బాద్మిశివకుమార్, విశ్రాంత ఐఏఎస్ శ్రీమాన్ పాహిమాం మాట్లాడుతూ దయానంద సరస్వతి వేద పండితుడిగా, ఆర్యసమాజ్ వ్యవస్థాపకుడిగా సత్యం, సమానత్వం, సామాజిక చైతన్య కోసం చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తుందని అన్నారు. అనంతరం తూము సుభాష్ ఆర్య రచించిన ‘అగ్నిహోత్ర మహావిజ్ఞానం’ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఎం.బాలయ్య, జగపతిరావు, గంగాధర్, శివుడు, రాజసింహుడు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

కోయిల్‌కొండ: మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నర్సింహులు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక కావడంతో బుధవారం ఏఎంఓ శ్రీనివాసులు జిల్లా విద్యాశాఖ తరఫున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మిడ్జిల్: మండలంలోని వస్పుల సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డా.సౌజన్య, సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్, సంపత్, పారిజాత, వార్డెన్ బాబురావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మరుగుదొడ్ల కూల్చివేతపై చర్యలు చేపడుతాం



జడ్చర్ల: స్థానిక జౌకీ నగర్‌లో గల ప్రభుత్వ భవనంలో అధికారుల అనుమతి లేకుండా ఏకపక్షంగా దాదాపు 15 మరుగుదొడ్లను కూల్చివేసిన వారిపై చట్టపరంగా చర్యలు చేపడుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత తెలిపారు. ఈనెల 7న మరుగుదొడ్ల కూల్చివేతకు సంబంధించి ‘సాక్షి’లో ‘అంతా నా ఇష్టం’ శీర్షికన కథనం వచ్చిన విషయం విధితమే.

సాక్షి ఎఫెక్ట్..

బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు కూల్చిన మరుగుదొడ్లను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భవనంలో గల మరుగుదొడ్లను ఎందుకు కూల్చారో అర్థం కావడం లేదన్నారు. లక్షలు విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రభుత్వ భవనం తనవార్డు పరిధిలో ఉన్నా కనీసం తమను ఎవరూ సంప్రదించలేదని కౌన్సిలర్ లత పేర్కొన్నారు. కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కౌన్సిలర్లు శశికిరణ్, లత, మహేశ్ ఉన్నారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినతి



జడ్చర్ల టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ బుధవారం బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి కుల గణన సర్వేచేసినా బీసీ సామాజికవర్గం ప్రజలు విశ్వసించటం లేదన్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన సకలజనుల సర్వే ఆధారంగా రాష్ట్రంలో హిందూ బీసీల జనాభా 56శాతం, ఈబీసీ జనాభాతో కలసి 66శాతం ఉంటుందన్నారు. అందుకే ప్రభుత్వం బీసీజనాభా లెక్కలపై పునఃసమీక్ష చేపట్టాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీసీ జాగృతి సేన నాయకులు నర్సింహులు, సురభి విజయ్‌కుమార్, లింగంపేట శేఖర్, గోపాల్, మురళి, శివరాములు, శివశంకర్, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వాహనదారుడికి రెండు రోజుల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారుడికి న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసులు ఈనెల 11న వన్‌టౌన్ చౌరస్తాలో చేసిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మణికొండకు చెందిన గంజి ఆంజనేయులు అనే వాహనదారుడు అధిక మోతాదులో మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతుంటే అదుపులోకి తీసుకున్నారు. సదరు వాహనదారుడిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. దీంతో ఆంజనేయులును వన్‌టౌన్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.